# సభామర్యాదలు మరియు సభ వెలుపలి, అధ్యయన పర్యటనలలో సభ్యుల నైతిక ప్రవర్తన (రూల్ 316-324)

## సభామర్యాదలు :

సభలో సభ్యులు పాటించవలసిన నియమాలను సాంకేతికంగా సభామర్యాదలని వ్యవహరిస్తారు. ఇవి శాసనసభ కార్యవిధాన, కార్యక్రమ నిర్వహణ నియమాలపైన, సంప్రదాయాలపైన, సభాపతి ఆయా సమయాలలో ఇచ్చిన రూలింగ్స్ పైన కూడా ఆధారపడి వుంటాయి. సభలో సభ్యులు సాధారణంగా పాటించవలసిన కొన్ని ముఖ్యమైన సభా మర్యాద నియమాల పట్టిక ఈ దిగువ ఇవ్వబడింది.

1) (ఎ) సాధారణముగా 9.00 గంటలకు ఆరంభమయ్యే సభా సమావేశ నిర్ణీత కాలమునకు

(బి) అదే రోజున వాయిదాపడిన తరువాత తిరిగి సమావేశమవుటకు అధ్యక్షుడు నిర్ణయించిన సమయమునకు కొన్ని నిమిషముల ముందు సభ్యులు సభలో హాజరుగా వుండవలెను. సభాపతి అధ్యక్ష స్థానాన్ని స్వీకరించడానికి వచ్చునపుడు ఆయన రాక ప్రకటించబడుతుంది. అధ్యక్షుడు సభా మందిరములో ప్రవేశించిన వెంటనే సభ్యులు వారి స్థానములలో నిలబడవలెను. అట్టి



సమయంలో సభలో ప్రవేశించిన సభ్యులు సభాపతి అధ్యక్షస్థానాన్ని స్వీకరించేవరకు నిశ్శబ్దంగా నిలబడి ఆ తరువాత వారి స్థానాలకు వెళ్ళవలెను.

(2) సభ్యులు సభలో ప్రవేశించినపుడు, వెళ్లేటప్పుడు అధ్యక్షస్థానానికి శిరస్సువంచి అభివాదము చేయవలెను. తమ స్థానములను స్వీకరించునపుడు, తమ స్థానముల నుండి వెడలిపోవునపుడు కూడా అట్లే చేయవలెను.

(3) సభ్యులు సభాకార్యక్రమంతో సంబంధముంటేనే తప్ప ఏ పుస్తకాన్ని గాని, వార్తాపత్రికను గానీ లేదా లేఖను గాని చదువరాదు.

(4) ఎవరైనా సభ్యుడు ప్రసంగిస్తున్నప్పుడు ఔచిత్యరహితమైన వ్యక్తీకరణము లేక శబ్దము చేయుట ద్వారా లేదా ఏదైనా యితర ఔచిత్య రహిత పద్ధతిలో అంతరాయము కలిగించరాదు.

(5) సభాపతి, సభనుద్దేశించి సభ్యులు సభ విడిచి వెళ్ళరాదు.

(6) సభ్యుడు సభనుద్దేశించి ప్రసంగించునపుడు, తన నిర్దేశ స్థానంలో ఉండవలెను.

(7) తాము సభలో ప్రసంగించనపుడు సభ్యులు మౌనమును పాటించవలెను.

(8) సభ్యుడు సభాకార్యకలాపాలను ఆటంకపరచుట, హేళన ధ్వనులను చేయుట లేదా అంతరాయము



కలిగించుట చేయరాదు మరియు వేరొక సభ్యుడు ప్రసంగించునపుడు ప్రత్యక్ష వ్యాఖ్యానము చేయరాదు.

(9) గ్యాలరీలు దేనిలో నికైనా ఆగంతకుడు ప్రవేశించునపుడు సభ్యులు ప్రశంసించరాదు.

(10) సభ్యులు సభలో నినాదాలు చేయరాదు

(11) సభ్యుడు సభాపతివైపు తన పుష్టభాగము వుండే విధంగా కూర్చుండు లేదా నిలుచుండుట చేయరాదు.

(12) సభ్యులు సభలో ఏ విధమైన బ్యాడ్జీలు ధరించుట లేదా ప్రదర్శించుట చేయరాదు.

(13) సభ్యులు సభలోనికి ఆయుధాలను తీసికొని వచ్చుట లేదా ప్రదర్శించుట చేయరాదు.

(14) సభ్యులు సభలో జెండాలను, చిహ్నాలను లేదా యితర ప్రదర్శిత వస్తువులను ప్రదర్శించరాదు.

(15) సభ్యుడు తన ప్రసంగాన్ని ముగించిన వెంటనే సభను వీడిపోరాదు. ప్రసంగము ముగించిన తరువాత సభ్యులు వారి స్థానాలను తిరిగి స్వీకరించి ఆ తరువాత మాత్రమే అవసరమైతే సభ నుండి వెళ్ళుట సభా మర్యాదకు ఆవశ్యకమై ఉన్నది.

(16) సభ్యులు సభా ఆవరణలో ఎటువంటి సాహిత్యము, ప్రశ్నావళి, చిన్న పుస్తకములు, పత్రికా ప్రకటనలు, కరపత్రములు మొదలగువాటిని పంచరాదు.

(17) ఆరోగ్యకారణంపై సభాపతి అనుమతిస్తే తప్ప ఏ సభ్యుడూ సభ లోనికి చేతికర్రను తీసుకెళ్ళరాదు.



(18) సభ్యుడు నిరశన సూచకంగా సభలో పత్రాలను మన చించరాదు.

(19)సభ్యుడు కేసెట్టులను లేదా టేపురికార్డర్ లను సభలోనికి తీసుకొని రావడంగాని, వినిపించడంగాని చేయరాదు.

(20)సభ్యులు సభలోకి వినిపించేటంతగా లాబీలో మాట్లాడటంగాని లేదా నవ్వడంగాని చేయరాదు.

(21)సభ్యుడు సభలో సత్యాగ్రహం లేదా ధర్నా చన చేయకూడదు.

(22)సభ్యులు సభామందిర మార్గంలో నిలబడ రాదు. వారు సభలో కూర్చుండుట గాని బయటకు వెళ్ళుట గాని చేయవలెను.

(23) సభ్యుడు/సభ సమావేశంలో నుండగా, సభాధ్యక్ష స్థానమునకు, మాట్లాడుచున్న సభ్యునకు మధ్యగా పోరాదు.

(24)సమావేశం మధ్యలో అవసరమైతే సభకు ఎటువంటి భంగం కలిగించకుండా సభ్యుడు తన స్థానమునకు దగ్గరగానున్న వెనుకద్వారం మునుండి త్వరగా బయటకు వెళ్లవలెను.

(25)సభాకార్యక్రమం జరుగుతున్నప్పుడు సభ్యులు తమలో తాము మాట్లాడరాదు. మరీ తప్పనిసరి అవసరమైయితే సభా కార్యక్రమానికి ఆటంకం కలగకుండా నెమ్మదిగా మాట్లాడుకోవచ్చు.

(26) సభ సమావేశంలో వుండగా సభా మర్యాదల తోను, సభా కార్యకలాపాలకు భంగం కల్గనటువంటి పద్ధతిలోను, ప్రతి సభ్యుడు మందిరం లోనికి ప్రవేశించుట, సభామందిరం నుండి బయటకు వెళ్ళుట చేయవలెను.)

(27)సభనుద్దేశించి ప్రసంగించదలచిన లేదా ప్రశ్నను అడగదలచిన సభ్యులు సభాపతి దృష్టిని ఆకర్షించడం సఫలీకృతులయ్యే వరకు తమ చేతులు ఎత్తవలెను. సభాపతి దృష్టి తమపై పడనంతవరకు, అధ్యక్షస్థానాన్ని ఉద్దేశించి ప్రసంగించమని లేదా ప్రశ్నను అడగమని పేరుతోగాని లేదా సంజ్ఞతోగాని సభాపతి పిలుచునంతవరకు సభ్యుడు/ సభ్యురాలు ప్రసంగించరాదు.

(28)సభ్యుడు ప్రసంగించునపుడు.

(1) న్యాయనిర్ణయం అపరిష్కృతంగా వున్న యేదైనా వాస్తవ విషయాన్ని ప్రస్తావించరాదు.

(2) వేరొక సభ్యునికి వ్యతిరేకంగా వ్యక్తిగత దోషారోపణ చేయరాదు.

(3) పార్లమెంటు లేదా ఏదైనా రాష్ట్ర శాసనమండలి యొక్క నిర్వహణ లేదా కార్యకలాపాల గురించి పరుషమైన వ్యక్తీకరణములు ఉపయోగించరాదు.

(4) సభానిర్ణయాన్ని రద్దు చేయు ప్రతిపాదన మినహా యిదివరకటి సభానిర్ణయాన్ని నిందకు గురిచేయరాదు.



(5) సముచిత పదజాలంతో వ్రాసిన నియమిత రూప ప్రతిపాదన చర్చ ఆధారపడి వుండిననే తప్ప ఉన్నతాధికార పదవులలోని వ్యక్తుల ప్రవర్తనపై నిందారోపణలు చేయరాదు.

వివరణము : ఉన్నతాధికార పదవులలోని వ్యక్తుల అను మాటలకు ఎవరి ప్రవర్తనను, రాజ్యాంగ చట్టము ననుసరించి సముచిత పదజాలముతో వ్రాసిన నియతరూప ప్రతిపాదనపై మాత్రమే చర్చించుటకు వీలున్నదో అట్టి వ్యక్తులు లేదా ఎవరి ప్రవర్తనను, తాను ఆమోదించాల్సిన, సముచిత పదజాలంతో వ్రాసినట్టి నియతరూప ప్రతిపాదనపై మాత్రమే చర్చించుటకు వీలున్నదని సభాపతి అభిప్రాయ పడినటువంటి వ్యక్తులు అని అర్థము.

(6) చర్చను ప్రభావితం చేయు ఉద్దేశ్యంతో గవర్నరు లేదా రాష్ట్రపతి పేరును ఉపయోగించరాదు.

(7) ప్రభుత్వ ద్రోహకరమైనట్టి, ప్రజాబద్ధతకు భంగకరమైన తిరుగుబాటును ప్రోత్సహించునట్టి లేదా అపకీర్తికరమైనట్టి పదములను ఉచ్ఛరించ రాదు.

(8) సభా కార్యక్రమమును ఆటంకపరచు నిమిత్తం తన వాక్స్వాతంత్ర్యమును ఉపయోగించరాదు.

(9) గ్యాలరీలు దేనిలోనైనా వున్న ఆగంతకుల గూర్చి ప్రస్తావించరాదు.



(10) ప్రభుత్వాధికారులను పేరుపెట్టి ప్రస్తావించ రాదు.

(11) సభాపతి పూర్వానుమతితో తప్ప లిఖిత ఉపన్యాసాన్ని చదువరాదు.

(12) సభాపతి ద్వారా తప్ప వ్యక్తిగతంగా సభా సభ్యులను సంబోధించరాదు.

(13) నియతరూప ప్రతిపాదనపై మినహా సభాపతి రూలింగును ప్రశ్నించడంకాని, వ్యాఖ్యానించడం గాని చేయకూడదు.

(29) సభాపతిచే ఖచ్చితంగా అనుమతించబడితేనే తప్ప ఏ సభ్యుడునూ సభాపతికి లేదా శాసన మండలి సచివాలయానికి తాను పంపిన నోటీసు లేదా వర్తమానములోని విషయాన్ని సభలో ఉత్పన్నం చేయరాదు. సభ్యునకు ఎటువంటి సమాచారం అందని యెడల విషయం సభాపతి పరిశీలనలో వున్నదని ఆయన భావించవలెను.

(30) సభాపతి మాట్లాడటానికి లేచినప్పుడు లేదా ఆర్డర్ అని హెచ్చరించినపుడు మరియు సభాపతి అనుమతితో ఎవరైనా యితర సభ్యుడు సభలో ప్రసంగించునపుడు లేదా చర్చ సమయంలో నియమభంగ ఆక్షేపణ ఉత్పన్నం చేయుటకు మధ్యలో జోక్యం చేసికొన్నప్పుడు కూడా ప్రతి సభ్యుడు తన స్థానంలో కూర్చొనవలెను.



(31) ఒక సభ్యుని, మరొక సభ్యుని తరపున ప్రసంగాన్ని చదువుటకు అనుమతించరు.

(32) ఆచరణ సాధ్యమైనంతవరకు సభ్యులను పేరు పెట్టి పిలవకుండుట అభిలషణీయము. కాని ఉదాహరణకు “ఇంతకు ముందు మాట్లాడిన సభ్యుడు”, “నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుడు”, నుండి వచ్చిన సభ్యుడు మొదలైన ఇతర సముచిత వదతిలో పిలువవచ్చును. నివారింపలేనంత అవసరమైతే పూర్తిపేరు ఉపయోగించవచ్చు.

(33) వేరొక సభ్యుడు ప్రసంగించునప్పుడు ఆయనతో ఏ సభ్యుడూ వాదించ రాదు. అంతే ప్రసంగించుచున్న సభ్యుని నుంచి సమాచారం పొందే ఉద్దేశ్యంతో ఆయన ప్రశ్నలను సభాపతి ద్వారా అడుగ వచ్చును. కాని అధ్యక్షుని అనుమతితో సభనుద్దేశించి ప్రసంగిస్తున్న సభ్యునికి యింకొక సభ్యుడు ఎడెతెగకుండా అంతరాయం కలిగించరాదు. ఆ అంతరాయం నియమభంగం ఆక్షేపణను ఉత్పన్నం చేయుటకు ఉద్దేశించినది కానిదైనచో ప్రసంగించుచున్న సభ్యుడు దానిని పట్టించుకోకుండా తన ప్రసంగమును కొనసాగించవచ్చు.

(34) పూర్వ ప్రసంగీకుల వాదనలను లేదా ఒకరి స్వంతవాదనలను పునరావృతం చేయుటకు ఆచరణ సాధ్యమైనంత మేరకు నివారించవలెను.

(35) ఏ సభ్యుడునూ సభామందిరం నుండి గ్యాలరీలలో నున్న వ్యక్తులతో మాట్లాడ రాదు. గ్యాలరీలో కూర్చున్న వ్యక్తులను గూర్చి ప్రస్తావన చేయుటకు లేక వారికి విజ్ఞప్తి చేయుట చేయరాదు.

(36) మంత్రులు మినహా సభ్యులు సభా మందిరంలో నుండి అధికార్ల గ్యాలరీలో ఉన్న అధికారులతో సంప్రదించుట పద్ధతికాదు.

(37) సభ్యుడు తన ప్రసంగ సమయంలో ఉదహరించిన పత్రాలు ఇతర సభ్యులకు లభ్యం కానపుడు, వాటిని సభాసమక్షంలో వుంచవలెను. డిమాండు వుండి అధ్యక్షుడు ఆ విధంగా ఆదేశించినట్లయితే ఆ సభ్యుడు ఆ పత్రాలను సభాసమక్షంలో వుంచుటకు సిద్ధం చేయవలెను.

(38) నిందా గర్భితమైన, పరుషమైన, సభా మర్యాదకు విరుద్ధమైన పదములను ఉపయోగించరాదు.

(39) అధ్యక్షుడు ఒక ప్రత్యేకమైన పదము లేదా వ్యక్తీకరణము సభామర్యాదకు విరుద్ధమని పేర్కొనప్పుడు, దానిపై ఎటువంటి చర్చ ఉత్పన్నం చేయుటకు ప్రయత్నించకుండా దానిని వెంటనే ఉపసంహరించుకోవలెను.



(40) సభ నిర్ణయం తీసుకొనవలసి వున్న విషయంలో ఒక సభ్యుడు వ్యక్తిగతమైన, ధనసంబంధమైన 2 లేదా ప్రత్యక్ష ప్రయోజనము కల్గివుండి ఆవిషయంపై కార్యకలాపాలలో పాల్గొనుచూ తన ప్రయోజనం వెల్లడి చేయుట ఆపేక్షనీయము. అది విభజన సమయంలో ఆయన ఓటుకు సంబంధించి అభ్యంతరాలు లేవదీయుటను నివారిస్తుంది.

(41) సభ్యుడు ప్రప్రథమంగా ప్రసంగము చేయుచున్నప్పుడు ఆయనకు అంతరాయము కలిగించరాదు.

(42) ఒక మంత్రి తనవద్దనున్న రికార్డులనాధారం చేసుకొని ఒక ప్రకటన చేసినపుడు, దాని నిజాయితీని బుద్ధిపూర్వకంగా సవాలు చేయబడిననే తప్ప అది వాస్తవమనియే అంగీకరించవలెను.

(43) ఏ సభ్యునకు వ్యతిరేకముగా సభా సమక్షంలో ఆరోపణలు చేయబడినప్పుడు ఆ సభ్యుడు సభముందు ఎట్టి ప్రశ్న లేకున్నప్పటికీ సభాపతి అనుమతితో వ్యక్తిగత వివరణ యివ్వవచ్చును. ఈ విషయంలో ఎట్టి చర్చనీయ విషయమును తీసికొనిరాకూడదు మరియు ఎటువంటి చర్చ ఉత్పన్నం కాదు.

(44) ఏదేని ప్రకటన ఒక సభ్యునికి ఆపాదించ బడినపుడు, అతడు ఆ ప్రకటన తాను



చేయలేదని చెప్పిన యెడల, ఆ విధముగా ఖండించుచు చేసిన ప్రకటన నిశ్శంకముగా అంగీకరించవలెను.

(45) ఎవరి ప్రవర్తన అత్యంత క్రమరహితముగా వున్నదని సభాపతి అభిప్రాయపడతారో అట్టి సభ్యుని వెంటనే సభ నుండి ఉపసంహరించు కొనవలసిందిగా ఆయన ఆదేశించవచ్చు. ఆ విధంగా ఆదేశించబడ్డ సభ్యుడు వెనువెంటనే ఆ విధంగా చేయవలెను మరియు ఆ రోజు మిగిలిన కార్యక్రమానికి హాజరు కారాదు.

(46) ఎవరైనా సభ్యుడు మరొక సభ్యుడిని కాని, మంత్రినిగాని విమర్శించిన యెడల ఆ విధంగా విమర్శింపబడిన వ్యక్తి తాను సమాధాన మిచ్చునపుడు విమర్శకుడు సభలో వుండవలెనని ఆపేక్షించుటకు హక్కు కలదు. ఆట్లు విమర్శింపబడిన వారు సమాధాన మిచ్చునప్పుడు హాజరు కాకుండుట సభా మర్యాదాధిక్రమణ కాగలదు.

## సభ వెలుపల సభ్యుల నైతిక ప్రవర్తనకు సంబంధించి మార్గదర్శక సూత్రాలు

(1) సభ్యులకు లేదా శాసనమండలి కమిటీల సభ్యులుగా ఉన్నందువలన సభ్యులకు గోప్యంగా అందచేసిన సమాచారాన్ని ఎవరికైనా వెల్లడి చేయుడంకాని లేదా తాము యజమానులుగా వున్న వ్యాపార సంస్థలు



లేదా వార్తా పత్రికలు సంపాదకులుగా లేక విలేకరులుగా తాము చేస్తున్న వృత్తి మున్నగు వాటికి ఆ సమాచారాన్ని ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని సభ్యులు ఉపయోగించుకోరాదు.

(2) ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని తనకు సంబంధమున్న వ్యాపార సంస్థ, కంపెనీ లేదా సంస్థలకు ప్రభుత్వం నుండి వ్యాపారాన్ని పొందడానికి సభ్యుడు ప్రయత్నించకూడదు.

(3) ప్రజా ప్రయోజనాన్ని ద ృష్టిలో ఉంచుకుని మాత్రమే ప్రతి సభ్యుడూ నిర్ణయాలు తీసుకోవాలే తప్ప తనకు, తన కుటుంబానికి లేదా తన స్నేహితులకు ఆర్థిక లేదా ఇతర వస్తుపరమైన ప్రయోజనాలను ఆశించి నిర్ణయాలు తీసుకోకూడదు.

(4) వాస్తవాధార రహితమైన సర్టిఫికెట్లను సభ్యుడు ఇవ్వరాదు.

(5) ప్రభుత్వం తనకు కేటాయించిన నివాస ప్రాంగణాన్ని సభ్యుడు మరొకరికి అద్దెకిచ్చి లబ్దిపొందకూడదు.

(6) ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని ఆర్థిక పరంగా తనకు ఆసక్తి వున్న అంశం విషయంలో ప్రభుత్వాధికారులను లేదా మంత్రులను సభ్యుడు అనుచితంగా ప్రభావితం చేయరాదు.

(7) ఎవరైనా వ్యక్తి లేక ఏదైనా సంస్థ ప్రయోజనార్థం, వారి తరపున తాను చేయదలచిన పనికోసం ఆ వ్యక్తి లేదా సంస్థ నుండి సభ్యుడు ఎట్టి విధమైన ఆతిధ్యాన్ని స్వీకరించకూడదు.

(8) సభ్యుడు, న్యాయ సదృశ (క్వాజీ జుడిషియల్) అధికారాలను వినియోగిస్తూ న్యాయవాది లేక న్యాయ సలహాదారుని, లేక వకీలు లేక సొలిసిటరీ హోదాలు మంత్రి లేదా అధికారి ముందు హాజరుకాకూడదు. ప్రభు

(9) తనకు రావలసియున్న మొత్తాలను క్లెయిము చేసే బిల్లులపై తప్పుడు సర్టిఫికెట్లకు సభ్యుడు ఎండార్సు చేయకూడదు.

(10) ప్రజా వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు, విజ్ఞాపనలను అందచేయడానికి అధికారిని ఆయన కార్యాలయంలో కలుసుకునే అధికారం సభ్యునికి వుంది. అధికారి వీలైనంత త్వరగా ఆ సమాచారాన్ని అందించాల్సి వుంటుంది.

శాసనమండలి కమిటీల అధ్యయన పర్యటనలలో సభ్యులు ఈ క్రింది ప్రవర్తనా నియమావళిని పాటించవల్సి వుంటుంది.

(1) పర్యటనలలో మధ్యంతర ప్రయాణాలు చేయకూడదు.

(2) కమిటీ పర్యటన సమయంలో ప్రభుత్వం/ ప్రభుత్వ సంస్థలు రవాణా సదుపాయాన్ని



కల్పించినప్పుడు ఆ సదుపాయాన్ని కమిటీ పని కోసమే వినియోగించాలే తప్ప సభ్యుల వ్యక్తిగత సుదూర సందర్శనలకు వినియోగించకూడదు.

(3) కమిటీ గురించి ఏ విధమైన విమర్శ రాకుండా వుండేందుకు గాని పర్యటనల సమయంలో తగిన హుందాతనాన్ని, మర్యాదను పాటించేందుకు సభ్యులు తగు శ్రద్ధతీసుకోవాలి.

(4) కమిటీ కార్యకలాపాల గురించి ఏ సభ్యుడు పత్రికా ప్రకటనలు చేయకూడదు. పత్రికలకు తెలియ పరచవసిన అవసరం ఏమైనా ఏర్పడినప్పుడు ఆ పనిని కమిటీ అధ్యక్షులే చేయాలి.

(5) పర్యటనలలో ఖరీదైన ఎట్టి బహుమతులను నభ్యులు అంగీకరించరాదు. అయితే, సందర్శించిన సంస్థకు సంబంధించిన ఖరీదైనవి కాని జ్ఞాపికలను స్వీకరించవచ్చు.

(6) కమిటీ, సబ్ కమిటీ లేదా అధ్యయనబ ృందం పర్యటన చేస్తున్నప్పుడు అధ్యయన పర్యటన యొక్క అంశంతో సంబంధమున్న ఏ ప్రయివేటు పార్టీవారైనా భోజనానికి, విందుకు లేదా ఇతర ఆతిధ్యానికి ఇచ్చే ఏ ఆహ్వానాన్ని కూడా అంగీకరించకూడదు.

(7) అధికారిక పర్యటనలకు ఇతర వ్యక్తినెవ్వరిని సభ్యుడు తీసుకుని పోకూడదు. సభాపతి పూర్వానుమతితో వైద్య కారణాలపై సభ్యులు ఒక సేవకుడిని లేదా జీవిత భాగస్వామిని వెంట



తీసుకుని వెళ్ళవచ్చు. అట్టి సందర్భాలలో జీవితభాగస్వామికి లేదా సేవకునికి అయ్యే సమస్త వ్యయాన్ని హోటల్ ఛార్జీలతో సహా - సభ్యుడే భరించాలి.

(8) అధికారిక అధ్యయన సందర్శనలో కమిటీ సభ్యులు ఏదేని సంస్థ, కార్యాలయం ఎస్టాబ్లిష్ మెంట్, ఇన్సలేషన్ కు వెళ్లినప్పుడు సభ్యుని జీవిత భాగస్వామి లేదా సేవకుడు వారి వెంట వుండకూడదు.

**శాసనసభ్యుల బృందాలు విదేశాలను సందర్శించునప్పుడు పాటించవలసిన ప్రవర్తనా నియమావళి.**

(9) అధికార పర్యటనలు / సందర్శనలు జరిపేటప్పుడు పత్రికలకు ఎటువంటి ఇంటర్వ్యూను కాని ప్రకటనను గాని ఇవ్వకూడదు. పత్రికా ప్రకటనలు లేదా ఇంటర్వ్యూలు ఇచ్చే అధికారం ఆ బృంద నాయకులకు మాత్రమే ఉంది.



21

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

# సభామర్యాదలు మరియు సభ వెలుపలి, అధ్యయన పర్యటనలలో సభ్యుల నైతిక ప్రవర్తన



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.